సాక్షి మంచిర్యాల

మంగళవారం । 25 । మార్చి । 2025



బిల్కగూడెం.. అభివృద్ధికి దూరం

దండేపల్లి మండలం బిల్కగూడెం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:24	బుధ : 4:59

గరిష్టం/కనిష్టం
36.0 /23.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'పది' పరీక్షకు 99.77శాతం హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి ఆంగ్ల పరీక్షకు సోమవారం 99.77శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 9,177 మందికి 9,156 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు 31మందికి గాను 24 మంది హాజరుకాగా ఏడుగురు రాలేదు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ నస్పూర్‌లోని మూడు పరీక్ష కేంద్రాలు, డీఈవో ఏడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 19 కేంద్రాలను పర్యవేక్షించాయని, అన్ని పరీక్షాకేంద్రాల్లో పరీక్ష సజావుగా సాగిందని డీఈవో యాదయ్య తెలిపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా
- పోలీసుస్టేషన్లలో తనిఖీ



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ

కోటపల్లి/వేమనపల్లి/భీమిని: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం ఆయన కోటపల్లి, వేమనపల్లి మండలం నీల్వాయి, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉండే పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందన్న భరోసా కల్పించాలని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నీల్వాయిలో మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతాలపై అడిగి తెలుసుకున్నారు. గతంలో జరిగిన ఘటనలు, మావోయిస్టుల కదలికలు, సానుభూతిపరులు, మిలిటెంట్లపై ఆరా తీశారు. కన్నెపల్లిలో పోలీసుస్టేషన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్సై శ్యాం పటేల్, ఎస్సై గంగారాం పాల్గొన్నారు.

కేంద్రమంత్రి సంజయ్‌పై ఫిర్యాదులు



చెన్నూర్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చెన్నూర్/కోటపల్లి/మందమర్రిరూరల్/మంచిర్యాలటౌన్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిపై జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, మందమర్రి, మంచిర్యాల పోలీసుస్టేషన్లలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. చెన్నూర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, సాధనబోయిన కృష్ణ, మోతె తిరుపతి, మంత్రి బాపు, రేవెల్లి మహేశ్, జోడు శంకర్ పాల్గొన్నారు. కోటపల్లిలో మాజీ వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి విద్యాసాగర్ ఫిర్యాదు చేశారు. మందమర్రిలో ఎస్సై రాజశేఖర్‌కు బీఆర్ఎస్ చెన్నూర్ ఇంచార్జీ రాజారమేష్, పట్టణ అధ్యక్షుడు రవీందర్, రాజశేఖర్, సంపత్, సూరిబాబు, మద్ది శంకర్, చిప్పకుర్తి రేఖ ఫిర్యాదు చేశారు. మంచిర్యాలలో ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు అంకం నరేశ్, శ్రీరాముల మల్లేశ్, అక్కూరి సుబ్బన్న, మెరుగు పవన్, బేర సత్యనారాయణ, పంబాల ఎర్రయ్య, పెరుమల్ల జనార్దన్, కుమ్మం రాజేశ్వర్‌రెడ్డి, కొండపర్తి శంకర్, కాటం రాజు, మహ్మద్ సాజిద్ ఉన్నారు.

సమావేశాలు నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: విద్యాశాఖకు సంబంధించిన అంశాలు–అమలుపై ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు సోమవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, జయకృష్ణ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్, ఆర్‌యూపీపీ, ఎస్జీటీయూ నాయకులు సంజీవ్, సత్యనారాయణచారి, శ్రీకర్ పాల్గొన్నారు.

తడి.. పొడి ఒకేచోట

- డంపింగ్‌యార్డుకు శాశ్వత స్థలం కరువు
- సెగ్రిగేషన్ చేసే చోటనే చెత్త డంపింగ్



వికాస్‌నగర్ వెళ్లే దారిలో పోచమ్మగుడి ఎదురుగా..



అండాళమ్మ కాలనీలోని సెగ్రిగేషన్ షెడ్లలో నిండిన చెత్త

సాక్షి ఫోకస్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో చెత్త సేకరించి తడి, పొడి చెత్తగా వేరు చేసేందుకు అండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు డంపింగ్ యార్డుగా మారాయి. శాశ్వత డంపింగ్ యార్డు కోసం పలు చోట్ల స్థలాలు ఎంపిక చేసినా ఎక్కడా అవకాశం లేకపోవడంతో సెగ్రిగేషన్ షెడ్లలోనే చెత్త వేస్తున్నారు. మంచిర్యాల పట్టణం నుంచి ప్రతీ రోజు 40మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ప్రస్తుతం అండాళమ్మ కాలనీలో చెత్త డంపింగ్ చేస్తున్న చోట 65 వేల మెట్రిక్ టన్నుల చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించక పోవ డం, డంపింగ్ యార్డుకు తీసుకు వచ్చిన తర్వాత వే రు చేయకుండా కలిపే వేయడంతో గుట్టలుగా పేరుకుపోతోంది. బయోమైనింగ్ ప్రక్రియను ప్రారంభించినా తరచూ ఏదో ఒక సమస్యతో ఆలస్యం అవుతోంది. దీంతో చెత్త వేసేందుకు డంపింగ్ యార్డులో స్థలం కరువైంది. గుర్తు తెలియని వ్యక్తులు చెత్త నిప్పంటిస్తుండడంతో పొగచూరి ఆ ప్రాంతంతోపాటు సమీపంలోని కాలనీల ప్ర జలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. చెత్త కాలడం వల్ల పొగ వస్తుండడంతో పలువురు శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు చెత్త నుంచి వెలువడుతున్న పొగతో అనా రోగ్యం బారిన పడుతున్నారు. మంచిర్యాల పట్ట ణానికి దూరంగానే గతంలో ఈ డంపింగ్ యార్డును ఏర్పాటు చేయగా, పట్టణం విస్తీర్ణం పెరిగి కాలనీలకు దగ్గరగా మారింది. డంపింగ్ యార్డులోని చెత్తకుప్పల నుంచి దుర్వాసనతోనే ప్రతిరోజు సమీప కాలనీలోని ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగను పీల్చి రోగాల బారిన పడుతున్నారు. చెత్తతో వచ్చే దుర్వాసనతోపాటు చెత్త కాలిపోవడం వల్ల వెలువడే పొగతో ఈ ప్రాంత కాలనీ ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కా లంతో సంబంధం లేకుండా చిన్నారులు, వృద్ధులు, యువత వ్యా ధుల బారిన ప డుతున్నారు. డంపింగ్ యార్డును అండాళమ్మ కా లనీ నుంచి తొలగించాలని కాలనీవాసులు పలు మార్లు ఆందోళనలను చేశారు. శాశ్వతంగా డంపింగ్ యార్డును తరలించాలని, ఉన్న చెత్తను కాల్చ కుండా చూడాలని స్థానికులు కోరుతున్నా అది నెరవేరడం లేదు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడంతో నస్పూర్ మున్సిపాలిటీతోపా టు హాజీపూర్ మండలానికి చెందిన ఎనిమిది గ్రామాలు ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కాగా, రోడ్లపైన చెత్త కుప్పలు తొలగించడంలో తాత్సారం చేస్తుండడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

చెత్త సేకరణ అధ్వానం

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి మున్సిపాల్టీ బెల్లంపల్లిలో చెత్త సేకరణ అధ్వానంగా మారింది. పట్టణంలో 34 వార్డుల్లో రోజువారీగా చెత్త సేకరించాల్సి ఉండగా.. పారిశుద్ధ్య సిబ్బంది, ఆటోట్రాలీల సమస్య కారణంగా మూడు నాలుగు రోజులకోసారి సేకరణ జరుగుతోంది. శివారు వార్డుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కనీసం పక్షం రోజులకోసారైనా చెత్త తొలగించడం లేదనే ఆరోపణలున్నాయి. రోజువారీగా 25టన్నుల చెత్త వెలువడుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పుర ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఖరారు కాని డంపింగ్ యార్డు

మున్సిపాల్టీ ఏర్పడి 38ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు డంపింగ్ యార్డు లేకుండా పోయింది. ఒకటోవార్డు కన్నాల బస్తీ శివారులో రెండు దశాబ్దాల క్రితం ఐదెకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో అధికారికంగా మళ్లీ ఎక్కడ నిర్వహించాలో ఖరారు చేయలేదు. 65డీప్, శాంతిఖని బస్తీల మధ్య ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ప్రతిపాదించి అక్కడ చెత్త వేస్తుండడంతో ఆ ప్రాంత ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. దీంతో గోల్‌బంగ్లాబస్తీ, గురిజాలకు వెళ్లే మార్గంలో ఉన్న హిందుశ్మశాన



శ్మశాన వాటిక సమాధుల్లో డంప్ చేసిన చెత్త

వాటికలో అనధికారికంగా చెత్త డంప్ చేశారు. దుర్వాసన వస్తుండడంతో తాజాగా గోల్‌బంగ్లాబస్తీ, నంబరు–2 ఇంక్లైన్ బస్తీ వాసులు ఆందోళన చేశారు. అక్కడి నుంచి మళ్లీ కాసిపేట శివారు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిలో చెత్త వేస్తున్నారు. వార్డుల నుంచి సేకరించిన చెత్తను కోర్టు ముందు ఉన్న రైతుబజార్ స్థలంలో నిల్వ చేస్తున్నారు. అక్కడ దుర్వాసన వెదజల్లుతుండడంతో సమీప ఇళ్ల ప్రజలు భరించలేకపోతున్నారు. సమయానుకూలంగా ట్రాక్టర్లు, ఆటో ట్రాలీల్లో అక్కడి నుంచి కాసిపేట శివారులోని ప్రభుత్వ భూమిలో డంప్ చేస్తున్నారు. జనావాసాలకు చేరువలో డంప్ యార్డు వద్దని కాసిపేట ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో డంప్‌యార్డును అధికారికంగా ఏర్పాటు చేయడంలో సతమతం అవుతున్నారు.

సెగ్రిగేషన్ షెడ్లు కరువు

డంప్‌యార్డు అతీగతీ లేకుండాపోవడంతో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలు లేకుండా పోయాయి. ఈ కారణంగా తడి, పొడి చెత్త సేకరణ జరగడం లేదు. అంతా ఒకే చోట నిల్వ చేస్తున్నారు. చెత్తను వేరు చేసి మున్సిపాల్టీకి ఆదాయ వనరులు సమకూర్చాలనే శ్రద్ధాసక్తులు కనిపించడం లేదు. డంప్ యార్డు వల్ల చెత్తను ఎరువుగా మార్చే ప్రయత్నాలు జరగడం లేదు. హిందు శ్మశాన వాటికలో ఎప్పటికప్పుడు పారబోస్తున్న చెత్తకు నాలుగైదు రోజులకోసారి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిస్తున్నారు. దీంతో భరించలేని దుర్వాసనతో కూతవేటు దూరంలో ఉన్న సంక్షేమ గురుకులాల విద్యార్థులు, గోల్‌బంగ్లాబస్తీ, నంబరు–2 ఇంక్లైన్, బెల్లంపల్లి బస్తీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, వృద్ధులు తట్టుకోలేకపోతున్నారు. దట్టమైన పొగ వ్యాపిస్తుండడంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

కబ్జా భూములు స్వాధీనం చేసుకుంటేనే..

బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములకు కొదువ లేదు. బుధాకలాన్‌శివారు సర్వే నంబరు 170లో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు దశాబ్దాల కాలం నుంచి దురాక్రమణకు గురవుతున్నాయి. నేటికీ అదే పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం ఐదెకరాల విస్తీర్ణంలో డంప్ యార్డు ఏర్పాటు చేయడానికి స్థల సమస్య ఉంది. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటే తప్పా డంప్ యార్డు ఏర్పాటు చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆ దిశగా అడుగులు వేసి డంప్‌యార్డు సమస్య తీర్చాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్థలాన్వేషణ జరుగుతోంది..



డంప్‌యార్డు సమస్య తీర్చడానికి ఎమ్మెల్యే వినోద్ జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో స్థలాల ఎంపిక ప్రక్రి య కొనసాగుతోంది. బస్తీ ప్రజలకు ఇబ్బందులు లేని స్థలాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యాం. రెండు మూడు చోట్ల ప్రభుత్వ స్థలాలను ప్రతిపాదించి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం. తుది నిర్ణయం కలెక్టర్‌పై ఆధారపడి ఉంటుంది. – కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు, జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, మందమర్రి, చెన్నూర్‌లో చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,278 కేసులు గుర్తించి 871 మందికి మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ పథకంలో భాగంగా జిల్లాలో ఏడు ముక్త్ గ్రామ పంచాయతీలను నిర్ణయించామని, వాటిలో చెన్నూర్ మండలం పొక్కూర్, కాసిపేట మండలం పల్లంగూడ, వేమనపల్లి మండలం సుంపుటం, జైపూర్ మండలం నర్వ, హాజీపూర్ మండలం పడ్తనపల్లి, భీమిని మండలం వీగాం, జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. క్షయ వ్యాధి నివారణలో ఉత్తమ సేవలు అందించిన 22 మంది వైద్యులు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు ప్రదానం చేశారు. హిందూ సేవక్ సమాజ్, పెన్నిధి వాలంటరీ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో వ్యాధిగ్రస్తులకు



పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు భీష్మ, ప్రోగ్రామ్ అధికారి సుధాకర్ నాయక్, అధికారులు అనిత, సీతారామరాజు, ప్రసాద్, హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బ నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

నస్పూర్: వేసవిలో వడదెబ్బ నుంచి రక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం మంచిర్యాల ఆర్‌డీఓ శ్రీనివాసరావు, జిల్లా ఆరోగ్య వైద్యాధికారి హరీష్‌రాజ్, అధికారులతో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా త్రిసభ్య కమిటీలో వైద్యాధికారి, ఎస్సై, తహసీల్దార్ సభ్యులుగా ఉంటారని, వడదెబ్బ కేసుల వివరాలు, మరణాలు ధ్రువీకరిస్తారని తెలిపారు. జిల్లాలో ఎస్‌సీడీ నోడల్ అధికారిగా డాక్టర్ ప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. అనంతరం వడదెబ్బ నియంత్రణ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అధికారులు పురుషోత్తం నాయక్, తిరుపతి, సుదానాయక్, అనిత, సీతారామరాజు, అనిల్, బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: జిల్లాలోని భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ మంచిర్యాల ఆర్‌డీఓతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని అన్నారు.

– మందమర్రి శివారులోని తన భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఈ విషయమై కోర్టులో కేసు కొనసాగుతున్నందున ఎలాంటి లావాదేవీలు జరగకుండా బ్లాక్ చేయాలని మందమర్రి మండలం విలేజ్ రామకృష్ణాపూర్‌కు చెందిన మెంగని శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

- ఇందిరమ్మ ఇళ్లు ప్రతీ దివ్యాంగుడికి కేటాయించాలని, 40శాతం వైకల్యం కలిగిన వారికి అంత్యోదయ రేషన్ కార్డులు అందించాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో అవకాశం కల్పించాలని, సదరం శిబిరాల్లో స్లాట్లను 100కు పెంచాలని తెలంగాణ దివ్యాంగుల ఐక్యవేదిక ప్రతినిధి నగురారపు సుమన్ కోరారు.

నా భూమి నాకు ఇప్పించాలి



గోదుంపేట శివారులో నా భర్త కమ్మరి రామయ్య పేరిట ఎకరం పది గుంటల భూమి ఉంది. నా భర్త 2002లో మృతిచెందాడు. అప్పటి నుంచి భూమి నా స్వాధీనంలో ఉన్నది. 2017లో గుర్సింగ మల్లక్క 10 గుంటలు, కాటెల శంకర్ 20గుంటలు, ఎనుముల మల్లక్క 20గుంటలు పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదైంది. పలుమార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేశాను. నా భూమి నా పేరు మీద నమోదు చేయించి ఇప్పించాలి. – నాగుల సుశీల, గ్రామం: కల్మలపేట, మం: వేమనపల్లి

మూడు చక్రాల వాహనం కోసం..



నేను చెన్నూర్ నివాసిని. వికలాంగుడిని. నాకు మూడు చక్రాల వాహనం కావాలని గతంలో దరఖాస్తు చేసుకున్నాను. నాకు నేటి వరకు వాహనం మంజూరు కాలేదు. మూడు చక్రాల వాహనం మంజూరు చేయించాలని కోరారు. – నగేశ్, చెన్నూర్

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- విక్రయించే వారిపై పీడీ యాక్టు
- మంచిర్యాల డీసీపీ భాస్కర్

తాండూర్: మండలంలో 2.47 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలను తాండూర్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మనోహర్ ఈ నెల 20న ఐచర్ వ్యాన్‌లో పల్లీల లోడును మధ్యప్రదేశ్‌లో దింపి తిరుగు ప్రయాణంలో నాగ్‌పూర్‌లో ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలతోపాటు 11 బ్యాగుల్లో 550 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను తాండూర్‌కు రవాణా చేశాడు. సోమవారం తాండూర్ మండలం అచ్చులాపూర్, గోపాల్‌నగర్ గ్రామాల మధ్య సన్యాసి మఠం అటవీ ప్రాంతంలో నకిలీ పత్తి విత్తనాల బ్యాగులను కారులోకి మారుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఐచర్ వ్యాన్, కారు డ్రైవర్లు సెగ్యం సందీప్, గాడిపల్లి సత్యనారాయణ, బోగే సాయికిరణ్, కుమార్‌లను, నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడానికి వచ్చిన నారాయణ, రమేష్, వెంకటేష్, సత్యం, తిరుపతిలను అరెస్టు చేశారు. 2.47 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు, కారు, ఐచర్‌వ్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాల దందాలో ప్రధాన సూత్రధారి మనోహర్‌రెడ్డి, మరో కొనుగోలుదారు మల్లేష్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. విత్తనాల విలువ రూ.6,17,500 వరకు ఉంటుందని వివరించారు. నకిలీ విత్తనాలు అంటగడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నకిలీ పత్తినాల కేసులు ఐదు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య, మండల వ్యవసాయ అధికారి సౌమ్య పాల్గొన్నారు.

కాసిపేట మండలంలో..

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌లో 50కిలోల




వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న కొండాపూర్‌లోని గుడిమల్ల చెంద్రయ్య ఇంట్లో పోలీసులు వ్యవసాయ అధికారి ప్రభాకర్‌తో కలిసి సోదాలు చేయగా నిషేధిత పత్తి విత్తనాలు లభించాయని తెలిపారు. ఈ నెల11న చెంద్రయ్య, కిష్టంపేటకు చెందిన కూనారపు బాలకృష్ణ, మందమర్రికి చెందిన జాని, ముల్కాల సుధీర్, గోవిందుల శంకర్‌లు నిర్మల్ జిల్లాకు చెందిన వ్యక్తి వద్ద కొనుగోలు చేశారని తెలిపారు. విత్తనాల విలువ రూ.1.25లక్షలు ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'ఒకే దేశం.. ఒకే ఓటు'

దండేపల్లి/లక్సెట్టిపేట: ఒకే దేశం, ఒకే ఓటు ఎంతో అనుకూలమైనదని, విద్యార్థులు జమిలీ ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన దండేపల్లి పద్మశాలి భవన్ వద్ద, లక్సెట్టిపేటలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగా హన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రాల అ సెంబ్లీలు, లోక్‌సభకు వేర్వేరుగా ఎన్నికలు ని ర్వహించడం వల్ల దేశప్రగతిపై ప్రభావం చూ పుతుందని తెలిపారు. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో అభివృద్ధి వేగం పుంజుకుంటుందని తె లిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్, దండేపల్లి మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు ముకేశ్‌గౌడ్, ర వీందర్, సత్తయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, శేఖర్, నరేష్ చంద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లిలో మాట్లాడుతున్న వెంకటేష్‌గౌడ్

మంచిర్యాలలో పీఎస్టీ వసూళ్లు

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: దేశంలో పన్ను వసూలుకు జీఎస్టీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తే మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పీఎస్టీ(ప్రేమ్‌సాగర్‌రావు ట్యాక్స్) వసూలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంచి మంచిర్యాలను వసూలు మంచిర్యాలగా మార్చారని విమర్శించారు. మంచిర్యాల ఉమర్‌మియా సొసైటీలో ఇంటికి రూ.6 లక్షలు, కలెక్టర్ కార్యాలయం వద్ద కూల్చిన ఇళ్లను మళ్లీ కట్టి, కోట్లు వసూలు చేశారని, మంచిర్యాల వ్యాపారుల వద్ద రూ.40 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. రోడ్డు వెడల్పు పేరిట భవనాన్ని కూల్చకుండా ఉండేందుకు గాను ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున, ఒకచోట రూ.50 లక్షలు వసూలు చేశారని విమర్శించారు. ఐబీక్యాల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి నెపంతో రూ.2 కోట్ల వసూలు చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ, ప్రైవేటు భూములు, బెల్లంపల్లి చౌరస్తా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

భూమి, తిలక్‌నగర్ ప్రభుత్వ భూమి, నస్పూరులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని తప్పకుండా కూల్చుతామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చిన తర్వాత వచ్చిన మెటీరియల్‌ను అమ్మితే వచ్చిన డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. శ్మశాన వాటిక నిర్వహణ కోసం మార్వాడి సమాజం, వైశ్యులు, బంగారం దుకాణాల నుంచి నెలకు రూ.లక్షల చొప్పున ఇవ్వాలని చెప్పడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు అంకం నరేశ్, గోగుల రవీందర్, బేర సత్యనారాయణ, మొగిలి శ్రీనివాస్, ఎర్రం తిరుపతి, పడాల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి


ప్రమోద్ మృతదేహం

బాసర: బాసర ఆలయానికి వెళ్లే మూల మలుపు రెండో ఆర్చి గేట్ వద్ద సోమవారం ప్రమాదం జరిగింది. సరస్వతీ ఆలయం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో బాసర విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ ప్రమోద్ డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై గణేశ్ పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ – దిలావార్‌పూర్ మార్గంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఖానాపూర్ పట్టణానికి చెందిన మజహర్ సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనంపై వెళ్తుండగా మేకల సుధీర్ అతడిని ఆపి తనిఖీ చేసి ఫొటోలు తీశారన్నారు. దీంతో మజహర్ పోలీసులు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు


దుప్పిని కాపాడిన యువకులు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ పరిసరాల్లోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు సోమవారం దాడి చేశాయి. జనావాసాల్లోకి వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడించాయి. స్థానిక యువకులు గమనించి కాపాడాచి కాపాడారు. యువకులు స్వాములు రాకేశ్, విష్ణు, ప్రశాంత్, అంజి దానిని అటవీ సిబ్బందికి అప్పగించారు.

సులభంగా కొత్త విద్యుత్ కనెక్షన్లు

నిర్మల్‌చైన్‌గేట్:వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ కనెక్షన్లను సులభంగా మంజూరు చేస్తున్నామని విద్యుత్ శాఖ నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.సుదర్శనం తెలిపారు. వినియోగదారునికి కొత్త సర్వీసుల మంజూరులో ఏదైనా కారణంతో దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారుడు తగు విధంగా స్పందించడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివిధ కారణాలతో డిపార్ట్‌మెంట్ రూల్‌కు లోబడి కొత్త సర్వీసులు ఆలస్యం కాకుండా దరఖాస్తుదారుడికి మెసేజ్ రూపకంగా ప్రతి దశలో వెళ్తుందన్నారు. అప్లికేషన్ స్థితిని తెలుసుకోవడానికి కొత్తగా ట్రాకింగ్ చేసే వెసులుబాటు కల్పించామని తెలిపారు. అప్లికేషన్ నంబర్‌తో టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి లేదా టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా వివిధ దశల్లో ఉన్న అప్లికేషన్ స్థితిని తెలుసుకోచ్చని వివరించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు చర్యలు


ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అందిస్తున్నామని, జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రారంభించారు. అనంతరం క్షయ నివారణకు ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు ముందుకు రావాలని, నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా ప్రోగ్రాం అధికారి సురేందర్, డీపీఎం ప్రశాంతి, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పద్మ, డెమో బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టాళ్ల నిర్మాణం... బల్దియాకు ఆదాయం

- ప్రభుత్వ, సింగరేణి ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారాలు
- స్టాళ్లు నిర్మించి అద్దెకు ఇస్తే మున్సిపాలిటీకి వనరులు


చాడేశ్వరి ముందు రోడ్డుపక్కన ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ, సింగరేణి ఖాళీ స్థలాలకు కొదువలేదు. అంతర్గత ప్రధాన రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. నిరుపేదలు, నిరుద్యోగులు, సింగరేణి రిటైర్డు కార్మికులు తోపుడు బండ్లపై, తాత్కాలికంగా చిన్నపాటి షెడ్లను ఏర్పాటు చేసుకుని పండ్లు, కూరగాయలు, మటన్, చికెన్, ఇతర రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. చిరు వ్యాపారం పేద కుటుంబాలకు జీవనాధారంగా మారగా శాశ్వత ప్రాతిపదికన నిర్వహించే అవకాశాలు లేకుండా ఉన్నాయి. మున్సిపాలిటీ పరంగా స్టాళ్లను నిర్మించి చిరు వ్యాపారులకు కేటాయిస్తే జీవనోపాధి కల్పించడంతో పాటు బల్దియాకు ఆదాయ వనరులు సమకూరే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఆదిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా చేస్తే ఉపయోగం

మున్సిపాలిటీలోని స్టేషన్ రోడ్‌కాలనీ (చర్రీస్ క్వార్టర్స్) అంతర్గత ప్రధాన రహదారి పక్కన చాడేశ్వరి ముందు, కోర్టు ఎదుట ఉన్న ఖాళీ స్థలాల్లో ప్రస్తుతం తోపుడు బండ్లు, షెడ్ల ఆధారంగా ప్రజావసరాలకు అనుగుణంగా మటన్, చికెన్, కట్టెలు, పండ్లు ఇతర రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మున్సిపాలిటీ పరంగా స్టాళ్లను నిర్మించడం వల్ల చిరు వ్యాపారులకు లబ్ధిచేకూరే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

- ఏరియాలకు అనుగుణంగా అందుబాటులో స్టాళ్లను నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల వాసులకు నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి సౌలభ్యంగా ఉంటుంది. బజారు ఏరియా ప్రాంతానికి రావడానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం కలిసి వస్తుంది. కాలినడకన వెళ్లి సునాయాసంగా కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుంది.
- మున్సిపాలిటీలో నివసిస్తున్న యువతకు స్వయం ఉపాధి లభించడంతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు నివారించడానికి అవకాశాలు ఉంటాయి.
- రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల్లో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఉండడంతో పాటు పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుంది.
- స్టాళ్ల ఏర్పాటు వల్ల మున్సిపాలిటీకి స్థిరమైన ఆదాయం వస్తుంది. తద్వారా సిబ్బందికి వేతనాలు చెల్లించడానికి ఆర్థికభారం నుంచి కాస్త ఉపశమనం కలుగుతుంది.
- స్టాళ్లను నిర్మించడం వల్ల సాధ్యమైనంత వరకు ఖాళీ స్థలాలు దురాక్రమణకు గురి కాకుండా ఉంటాయి. ప్రజావసరాలకు దోహద పడతాయి.

రెండు చోట్ల స్టాళ్ల నిర్మాణం

మున్సిపాలిటీ తరఫున ఇప్పటికే మూసివేతకు గురైన సింగరేణి వర్క్‌షాప్, స్టోర్స్ ముందు ప్రధాన రహదారి పక్కన, కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద స్టాల్‌ల నిర్మాణం జరిగింది. వాటిని చిరు వ్యాపారులు అద్దెకు తీసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కాల్‌టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రెండువైపులా స్టాళ్లు ఉండగా ఒకవైపు ఉన్న వాటిని మాత్రమే అద్దెకు తీసుకున్నారు. రామకృష్ణ థియేటర్ పక్కన నిర్మించిన స్టాళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కాగా స్టాళ్లలో కాకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద కొంతమంది కూరగాయలు అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం. స్టాళ్ల ద్వారా మున్సిపాలిటీకి స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నా సరిగా శ్రద్ధపెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సముచిత నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి అమ్ముతున్న యువకుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. సోమవారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం... కన్నాల బస్తీ వద్ద కొందరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, పోలీసు సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల్లో ఎండీ.తాజ్‌బాబా(హన్మాన్ బస్తీ–బెల్లంపల్లి), షేక్ ఇర్ఫాన్ బాబా (షంషీర్ నగర్–బెల్లంపల్లి), వాసాల గిల్‌క్రిస్ట్(రాజీవ్‌నగర్–తాండూర్), మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి వలస వచ్చిన సంతోష్ సామ్రాడ్ జాదవ్ (కాల్‌టెక్స్ ఏరియా) ఉన్నారు. వీరి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా గంజాయి, తాగుడుకు బానిసగా మారి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

రూ.26.25లక్షలు పలికిన తైబజార్


వేలం నిర్వహిస్తున్న కమిషనర్ రాజు

కై లాస్‌నగర్: పట్టణ తైబజార్ వేలం ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరింది. పట్టణానికి చెందిన మీర్జా అఫ్రీన్‌బేగ్, సయ్యద్ ఇస్రార్, కాళ్ల సాయికృష్ణలు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ సీవీఎన్.రాజు అధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఇస్రార్ గైర్హాజరు కాగా మిగతా ఇద్దరు హాజరయ్యారు. ఇందులో అధికంగా రూ.26.25 లక్షలకు మీర్జా అఫ్రీన్‌బేగ్ తైబజార్‌ను దక్కించుకున్నారు. గతేడాది రూ.20.69 లక్షలకు వేలం వేయగా, ఈసారి బల్దియాకు రూ.5.56లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. సదరు వ్యక్తికి ఏడాదిపాటు తైబజార్ నిర్వహించుకునే అవకాశముంటుంది. బల్దియా ఉద్యోగులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఎంపికపై ఫిర్యాదు

- ఒకే కేంద్రంలో 61 మంది ఎంపికపై విచారణకు తల్లిదండ్రుల వినతి


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: భైంసా పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రంలో 61 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంపై విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లి దండ్రులు, నాయకులు కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సోమవారం ఫిర్యాదు చేశారు. గతేడాది నవంబర్ 24న జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష జరిగిందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన ప్రొవిజినల్ లిస్టులో అధికారులు 68 మంది పేర్లు ప్రకటించగా, అందులో భైంసా కేంద్రానికి చెందిన వారే 61 మంది ఎంపిక కావడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విచారణ చేసి మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో పుప్పాల గజేందర్, విద్యార్థుల తల్లి దండ్రులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్


ఫ్లెక్సీలు విడుదల చేస్తున్న ఎస్పీ, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డితో సోమవారం ట్రాఫిక్ అవగాహనతో కూడిన ఫ్లెక్సీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. పట్టణంలో సీసీ కెమెరాల ద్వారా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు పోతారం శ్రీనివాస్, సీహెచ్.నాగేందర్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో భార్యాభర్తలకు జైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ దుకాణంలో దొంగతనానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలు శిక్ష పడింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పోస్టాఫీసు బస్తీకి చెందిన అజయ్‌కుమార్ సహానికి బజారు ఏరియా ప్రాంతంలో బట్టల దుకాణం ఉంది. 2022 నవంబర్ 6న రాత్రి దుకాణంలో చోరీ జరిగింది. 250 గ్రాముల బంగారు బిస్కెట్లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.5000 నగదు దొంగిలించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్‌వో ఎం.రాజు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. బెల్లంపల్లి హన్మాన్‌బస్తీకి చెందిన భార్యాభర్తలు ఎండీ.బద్రుద్దీన్, అస్పియా సీరిన్‌పై కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ చేసి చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.అజయ్‌కుమార్ ప్రవేశపెట్టగా జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జే.ముకేష్ విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఆరు నెలల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

దాడికేసులో ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: దాడి కేసులో ముగ్గురిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురు కార్మికులపై ఈనెల 9న కొందరు దాడిచేశారు. కార్మికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి భగత్‌సింగ్ కాలనీకి చెందిన అడ్లూరి రాజు, సమీర్, అర్బాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ


హనుమాన్ ఆలయంలో పగులగొట్టి ఉన్న తాళం

బోథ్: మండలంలోని పెద్దార్లగుట్టలో హనుమాన్ ఆలయం, వాగు వద్ద గల అయ్యప్ప సన్నిధానంలో చోరీ జరిగింది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం స్థానికుడు.. అయ్యప్ప సన్నిధానానికి వెళ్లగా తలుపుల తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా ఉంది. అలాగే హనుమాన్ ఆలయం తాళం పగులగొట్టి ఉండడాన్ని భక్తుడు గమనించాడు. హుండీని పగులగొట్టి ఉండడంతో స్థానికులకు సమాచారం అందించాడు. అందులో నగదు ఎత్తుకెళ్లారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని పట్నాపూర్‌కు చెందిన మడావి కార్తీక్ చోరీ చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఐదు గంటల్లోనే దొంగను పట్టుకున్న ఎస్సై, పోలీసు సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ద్వారకానగర్‌లో ఆదివారం రాత్రి బైక్ చోరీకి గురైంది. నేరడిగొండ మండలంలోని వాగ్దారికి చెందిన సోయం వెంకటేశ్ ఆదిలాబాద్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేసిన ఆయన ఉదయం చూసే సరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కలా గాలించినా కనిపించలేదు. సోమవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

మహారాష్ట్ర వ్యక్తి మంచిర్యాలలో అరెస్ట్

మంచిర్యాలక్రైం: మహారాష్ట్ర పోలీసులు మంచిర్యాలలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన కలకలం రేపింది. అరెస్ట్ అయింది ఎవరు..? ఎందుకు అరెస్ట్ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా.. మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని కోలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లింది వాస్తవమేనని పేర్కొన్నారు. మహారాష్ట్ర పోలీసులను సంప్రదించగా.. మహారాష్ట్రలోని కోలాపూర్ ప్రాంతానికి చెందిన ప్రసాద్ పురస్కార్(ఓ నేషనల్ చానల్ రిపోర్టర్) ఛత్రపతి శివాజీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలో అల్లర్లు చెలరేగాయని తెలిపారు. ఈ మేరకు ప్రసాద్‌పై కోలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. ప్రసాద్ కోసం గాలిస్తుండగా తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలలో తలదాచుకున్నాడని సాంకేతికత ఆధారంగా గుర్తించి సోమవారం అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు తెలిపారు.

స్వర్ణకారులకు గడ్డు కాలం

- ఆర్నెళ్లుగా పసిడి ధరలు పైపైకి
- నగల తయారీపై ప్రభావం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


పనులు లేక ఖాళీగా కూర్చున్న స్వర్ణకారులు

పాతమంచిర్యాల: పసిడి ధరలు రోజురోజుకూ పైపైకి పోతున్నాయి. ఆర్నెళ్లుగా బంగారం ధరలు పెరుగుతుండడంతో ఆ ప్రభావం నగల తయారీపై పడుతోంది. దీంతో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న స్వర్ణకారులు, బంగారు ఆభరణాల తయారీదారులు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. బంగారం ధర నిలకడగా ఉండకపోవడంతో కొనుగోలు దారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో చిన్నచిన్న ఆభరణాలు తయారు చేసేవారికి పని లేకుండా పోతోంది. పెరుగుతున్న బంగారం ధర ఒక కారణమైతే కార్పొరేట్ సంస్థలు తయారు చేసే ఆభరణాలు కొనుగోళ్లు కాగా బెంగాల్ నుంచి వచ్చిన కొందరు నగల తయారీదారులు తక్కువ రేట్లకే నగలు తయారు చేయడం మరో కారణంగా స్వర్ణకారులు పేర్కొంటున్నారు. కాగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న స్వర్ణకారులకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

పెరుగుతున్న బంగారం ధరలు

గతేడాది నవంబర్‌లో బంగారం 10 గ్రాములకు రూ.78 నుంచి రూ.79 వేలకు మధ్యలో ఉంది. డిసెంబర్ నుంచి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం రూ.90,900 ధర పలుకుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో కూడా నగల తయారీ కోసం అంతగా ఆర్డర్లు రాలేదని, తాళిబొట్లు, పుస్తెమెట్టెల తయారీకి కూడా ఆర్డర్లు దొరకడంలేదని వాపోతున్నారు. వాటి తయారీకి కూడా ఆర్డర్లు రావడంలేదని, అవి కొనుగోలు చేసేందుకు పెద్ద పెద్ద దుకాణాలకే వెళ్తున్నారని స్వర్ణకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను బీసీ కార్పొరేషన్‌లో కాకుండా స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు అందిస్తే కొంత చేయూత అందించినట్లవుతుందని స్వర్ణకార సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

స్వర్ణకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీపై రుణాలు అందించాలి. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి బంగారు నగల తయారీ చేస్తూ మాకు పనులు లేకుండా చేస్తున్న వారిని కట్టడి చేయాలి.

– ధర్మవరం బ్రహ్మయ్య, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల

ధరల పెరుగుదల నియంత్రించాలి



బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతుండంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. పెళ్లిళ్లు, శుభ కార్యాలకు బంగారం కొనాలంటే ప్రజలు ఆలోచన చేస్తున్నారు. నగలు తయారు చేయించుకునేందుకు మొగ్గు చూపడంలేదు. బంగారం ధరలు తగ్గితే సామాన్యులకు కొంత ఊరట కలుగుతుంది.

– ఎర్రోజు వేణుగోపాలాచారి, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

పనుల్లేక ఖాళీగా ఉంటున్నాం



పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే ఆభరణాల తయారీలో బిజీగా ఉండేవాళ్లం. కానీ ప్రస్తుతం పనులు లేక ఖాళీగా ఉంటున్నాం. ధరలు పెరగడంతో బంగారం కొనుగోళ్లు తక్కువయ్యాయి. దీంతో పనులు లేక షాపులకు అద్దె చెల్లించలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఆదుకుంటేనే స్వర్ణకార వృత్తిదారులకు మనుగడ.

– రమేశ్, స్వర్ణకారుల సంఘం జిల్లా నాయకులు, మంచిర్యాల

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు విరాళం


విరాళం ప్రకటిస్తున్న ముఖరా కే గ్రామస్తులు

ఇచ్చోడ: వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవ సభకు ముఖరా కే గ్రామస్తులు సోమవారం రూ.1,02,003 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేశారని తెలిపారు. అందుకని 25ఏళ్ల పార్టీ ఆవిర్భవ సభకు గ్రామస్తులంతా కలిసి ఖర్చుల కోసం విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విరాళం చెక్కును అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు మానుకోవాలి

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్(చెన్నూర్): అధికారులు కార్మికులపై వేధింపులు మానుకోవాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిని సెంట్రల్ కమిటీ సభ్యులు తిప్పారపు సారయ్యతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బెదిరింపు లెటర్లు, చార్జీషీట్లు ఇస్తూ కొంతమంది అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, వేతనంలో కోత విధిస్తున్నారని, సమస్యల మీద ప్రశ్నించిన వారిని టార్గెట్ చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్మికులు తెలపగా అధికారులపై మండిపడ్డారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారించడంతో పాటు రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు అశోక్, కొమురయ్య, సాయికుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ‘త్రినయన’


విద్యార్థులతో ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ట్రిపుల్ ఐటీలో త్రినయన సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో జానపదాల పాటలు, నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచయి. కళలు, సంగీతం, నృత్యం మాత్రమే కాకుండా, ఫ్యాషన్ ప్రదర్శన ‘ఫ్యాషన్ ఫ్రెంజీ’ ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ‘త్రినయన’ పేరిట జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు తమలోని కళా నైపుణ్యం ప్రదర్శించారన్నారు. ఈ ఉత్సవం విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏఓ రణధీర్‌సాగి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కన్వీనర్లు డాక్టర్ రాములు, డాక్టర్ అజయ్, ప్రభాకర్‌రావు అసోసియేటెడ్, డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు

వైద్య విద్యార్థుల జోష్


మెమెంటోలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సులేమాన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఫెస్ట్ 2.0లో వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరిస్తున్నాయి. వైద్య విద్యలో నిత్యం బిజీగా ఉండే విద్యార్థులు ఈ నెల 27నుంచి కళాశాలలో క్రీడలు నిర్వహించగా, 21నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఫెస్ట్‌లో ప్రదర్శించి ఆకట్టుకుంటున్నారు. 300మంది ఎంబీబీఎస్ విద్యార్థులు వారం రోజులపాటు నిర్వహించే ఫెస్ట్‌కు కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.సులేమాన్, ప్రొఫెసర్లు ప్రోత్సహిస్తూ, వారికి మెమెంటోలు అందజేస్తున్నారు.